సీఆర్‌పీఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్‌గుప్తా



మేడ్చల్: వినియోగదారుల సంఘం సీఆర్‌పీఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన రమేశ్‌గుప్తా నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో వినియోగదారుల హక్కుల రక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఘట్‌కేసర్: వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో చందుపట్లగూడలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ముఖ్య అతిథిగా కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, ఆస్పత్రి సీఓఓ నీలిమా హాజరై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) సూర్యదేవర నీలిమా మాట్లాడుతూ శిబిరంలో పాల్గొని రాయితీ కార్డు తీసుకున్న వారు ఆస్పత్రిలో చేరితే 50 శాతం రాయితీతో వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యశిబిరం ఇన్‌చార్జి భరత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వైద్యులు, మెడికల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రంగనాయక ఆలయంలో సుదర్శన యాగం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీ గోదాదేవి శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం ఆదివారం సుదర్శన యాగం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ఒడి బియ్యం, గాజులు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజీవ్ గృహకల్పకు బస్సు ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి బస్సు సర్వీసును కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సహకారంతో బస్సు సౌకర్యం కలిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం నాలుగు ట్రిప్పులు, సాయంత్రం మరో నాలుగు ట్రిప్పులు కాలనీకి బస్సు వస్తుందన్నారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉల్లెంగుల బలరాం, దేవేందర్, వెంకటేశ్, చలపతి, రాజేందర్, జాఫర్ హుస్సేన్, రాజేందర్ నాయక్, ఐలయ్య, పద్మావతి, రేణుక, బద్రు నాయక్, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిర్మాపూర్‌లో కులసంఘాల భవనాల ప్రారంభం



కులసంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: గిర్మాపూర్‌లో పలు కులసంఘాల భవనాలను ఎమ్మెల్యే మల్లారెడ్డి నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే సొంత నిధులు మంజూరు చేయగా గ్రామ పరిధిలో రజక, ముదిరాజ్ కుల భవనాలు నిర్మించారు. అలాగే గ్రామంలో పునఃనిర్మిస్తున్న దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు భాస్కర్‌యాదవ్, బాలప్ప, రాజిరెడ్డి, మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న ‘లక్ష డప్పులు..వెయ్యి గొంతులు’

జవహర్‌నగర్:

ఫిబ్రవరి 7న నిర్వహించనున్న ‘లక్ష డప్పులు..వెయ్యి గొంతుకల’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. క్రాంతి కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 30 ఏళ్ల మందకృష్ణ మాదిగ పోరాటం, ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఎలిగెత్తి చూపుదామని.. వర్గీకరణకు అడ్డం వచ్చేవాళ్లకు అర్థమైతలేదా అంటూ పాట రూపంలో కళాకారుడు వెంకటచారి చూపించిన సీడీని జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్వై.అశోక్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాంచందర్, కొయ్యడ వెంకటేశ్, సదానందం, కూటి శ్రీనివాస్, పరశురాం, యాకస్వామి, నరేశ్, ప్రకాశ్, యాదయ్య, విజయ, శంకర్, కొమురయ్య, ప్రజా సంఘాల నాయకులు, క్రాంతి కళా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఏపూరి సోమన్న, అశోక్, తదితరులు

రైల్వే వంతెన పనులపై జేఏసీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్: పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో రైల్వే వంతెన పనులపై ఐక్యకార్యాచరణ కమిటీ కన్వీనర్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. రిలే నిరాహార దీక్షల ఫలితంగానే వంతెన, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైనా పనులు నిర్మాణాలు వేగవంతం కావడం లేదని, త్వరగా పనులు పూర్తి చేసి ఆర్టీసీ బస్సులు రాకపోకలకు సాగించేలా రోడ్డు వేయాలని, బాధితులకు నష్టపరిహారం అందేలా చూడాలని అఖిలపక్ష నాయకులు తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, రాఘవరెడ్డి, ప్రమోద్‌గుప్తా, కమలాకర్, యాదగిరి, చంద్రశేఖర్‌గుప్తా, కిశోర్‌గౌడ్, సంజీవగౌడ్ పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సదస్సును జయప్రదం చేయండి



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం (టీఆర్‌వీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 9న నగరంలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే సదస్సుకు రజకులు తరలివచ్చి జయప్రదం చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్ పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ లక్ష్మీనర్సింహకాలనీలో సదస్సు పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రజకులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపడం సరికాదని, ఉచిత విద్యుత్ పథకానికి ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించలేక రజకులపై ఒత్తిడి తెస్తూ బెదిరింపులకు దిగడం దుర్మార్గమన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లాకు రూ.10 కోట్ల నిధులు కేటాయించి, రజకులకు రూ.10 లక్షల రుణం అందజేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింహ, తిరుపతి, కనకయ్య, వెంకన్న, శంకరయ్య, మధు, రాములు, ప్రభాకర్, కుమార్, రవి, శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం, టీయూటీఎఫ్ కేలండర్ల ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అపెక్స్ కమిటీ కన్వీనర్ పుట్టం పురుషోత్తంరావు



టీయూటీఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, వెంకటేశ్వర్లు

కీసర: శ్రీరామలింగేశ్వర మున్నూరు కాపు సంఘం కీసర మండల కమిటీ నూతన సంవత్సరం 2025 కేలండర్‌ను రాష్ట్ర అపెక్స్ కమిటీ కన్వీనర్ పుట్టం పురుషోత్తంరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిందం మహేందర్, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి వెంకటేశ్వరరావు, కోశాధికారి మల్కాల రమేశ్, ప్రతినిధులు వేల్పుల శ్రీనివాస్, కర్ర వెంకన్న, ఏనుగు వెంకటేశ్వరరావు, సంద ముత్తన్న, లక్ష్మీకాంతయ్య, కంభం కనకయ్య, చందుపట్ల రాజు, పోగుల ఆంజనేయులు, గంధం వెంకన్న, రాచమల్ల లక్ష్మణ్, తోట నరేశ్, ఉప్పు వీరేశ్, రామ్‌శెట్టి వెంకటేశ్, చేపూరి సుధాకర్, గంధ్ర కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ కేలండర్..

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్‌లో టీయూటీఎఫ్ నూతన సంవత్సర కేలండర్, డైరీని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, టీయూటీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లుతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, ఉపాధ్యాయులు కైలాసం, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్ అధ్యక్ష ఎన్నికపై స్టే



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్‌షిప్ అధ్యక్షుడు హరిప్రసాదరావు

పోచారం: సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు డిసెంబర్ 22న జరిగాయి. అదేరోజు కౌంటింగ్ నిర్వహించి అధ్యక్షుడిగా బెజ్జంకి హరిప్రసాదరావు ఎన్నికైనట్లు త్రిసభ్య ఎన్నికల కమిటీ సర్టిఫికెట్ జారీ చేసింది. అయితే కౌంటింగ్‌పై అనుమానాలు వ్యక్తం చేసిన ప్రత్యర్థి అభ్యర్థి భరత్‌కుమార్ రీకౌంటింగ్ చేపట్టాలని కోరారు. ఈమేరకు డిసెంబర్ 29న ఇద్దరు ఎన్నికల కమిటీ సభ్యులు రీకౌంటింగ్ నిర్వహించి 4 ఓట్ల ఆధిక్యతతో భరత్‌కుమార్ గెలిచినట్లు ప్రకటించారు. దీంతో అప్పటికే అధ్యక్షుడిగా ఎన్నికై సర్టిఫికెట్ పొందిన హరిప్రసాదరావు కోర్టును ఆశ్రయించారు. దీంతో భరత్‌కుమార్ ఎన్నికపై కోర్టు స్టే విధించింది. ఈ సందర్భంగా హరిప్రసాదరావు ఆదివారం సమావేశం మాట్లాడారు. ఎలక్షన్ కమిటీ సభ్యులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పోలీసుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ అంతా సజావుగానే జరిగిందని అంగీకరించిన అభ్యర్థులే తర్వాత రీకౌంటింగ్ అంశాన్ని లేవనెత్తడం అర్థరహితమన్నారు. ఇప్పటికైనా ప్రత్యర్థులు చట్టాన్ని గౌరవించి అసోసియేషన్‌కు సహకరించాలని ఆయన కోరారు.

కీసర గ్రామ రజక సంఘ కార్యవర్గం ఎన్నిక



పత్రం అందుకుంటున్న అధ్యక్షుడు జూపల్లి అశోక్

కీసర: కీసర గ్రామ రజక సంఘ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా జూపల్లి అశోక్, ఉపాధ్యక్షుడిగా జూపల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా తంగళ్లపల్లి భవానీ శంకర్, జాయింట్ సెక్రటరీగా పిడిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా జూపల్లి అశోక్, గౌరవ సలహాదారులుగా తంగళ్లపల్లి కృష్ణ, జూపల్లి సాయిలు, జూపల్లి భిక్షపతి, రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. రజక సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో బీసీలను గెలిపించుకోవాలి



సదస్సులో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ప్రతినిధులు, మేధావులు, నాయకులు

పోచారం: రాష్ట్రంలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులను పోటీ చేయించి గెలిపించుకుందామని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టీ.చిరంజీవులు పిలుపునిచ్చారు. కొర్రెముల్‌లోని జేకే కన్వెన్షన్‌లో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ‘పంచాయతీ ఎన్నికలు–బీసీల పాత్ర’పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ రాజ్ సంస్థల క్రమాన్ని వివరించారు. శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీలు ఏకమై బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీసీలు పార్టీల వారీగా విడిపోకుండా గెలుపే లక్ష్యంగా పాటుపడాలన్నారు. మాజీ ఐఏఎస్ సాల్లేటి ప్రభాకర్, బీసీ నేత చెరుకు సుధాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై స్పందించి, వాటి పరిష్కారానికి కృషి చేసే వారిని ప్రజలే గెలిపిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల బీసీ సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఘట్‌కేసర్: జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్ ఆధ్యక్షతన ఘట్‌కేసర్‌లో ఆదివారం నిర్వహించిన మాదిగ విద్యార్థి. యువగర్జన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని, ఆయనకు మద్దతుగా ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి యువగర్జన సభను నిర్వహిస్తున్నామన్నారు. కులస్తులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ రాజకీయ వేదిక టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, టీ దళిత బహుజన సమితి అధ్యక్షుడు మల్లికార్జున్, ఎమ్మార్పీఎస్ టీ కన్వీనర్ నరసింహ, టీ బహుజన రాష్ట్ర సమితి అధ్యక్షుడు స్టాలిన్, స్టూడెంట్ ఫెడరేషన్ టీ కన్వీనర్ సురేశ్, నరేశ్, గణేశ్, మహేశ్, రాందాసు పాల్గొన్నారు.

వైభవంగా గుట్టల మల్లన్న జాతర



ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



మల్లన్న సేవలో కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: గిర్మాపూర్‌లో గుట్టల మల్లన్న జాతర ఆదివారం వైభవంగా జరిగింది. యేటా మొదటి ఆదివారం మల్లన్న ఆలయంలో జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించగా, మధ్యాహ్నం బోనాలు సమర్పించి, సాయంత్రం తొట్టెల ఊరేగింపు చేపట్టారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కౌన్సిలర్లు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు గిర్మాపూర్‌వాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు సహకారం అందిస్తా



మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఘట్‌కేసర్: పట్టణంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలోని విగ్రహానికి ఆదివారం పూలమాల వేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలు అనుసరించి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో దాసు, మల్లేశ్, శ్రీనివాసరావు, రాందాసు, నర్సింగ్‌రావు, సత్యం, భీంహలీన్, చంద్రశేఖర్, భిక్షపతి, బాబురావు, రాజేశ్‌కుమార్, అంజయ్య, నరేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం అధ్యక్షుడిగా రాఘవేంద్ర ఎన్నిక

కీసర: మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పులోజి రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా సింగోజు చందుచారి, కోశాధికారిగా గుడ్డోజి కనకాచారి, ఉపాధ్యక్షులుగా కాసోజు సంతోష్ చారి, టిపోజు కృష్ణాచారి, ఉపకార్యదర్శిగా టిపోజు రవిచారి, సలహాదారులుగా మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, బాలలింగచారి, శ్రీనివాసచారి, రవీంద్రచారి, నాగరాజు, చంద్రమౌళి, రాము, కుమార్, అనంతచారి, మురళి ఎన్నికయ్యారు.



కీసర విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గం

పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



2 కే రన్‌ను ప్రారంభిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను సాధ్యమైన మేర మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని, అప్పుడే వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడతాయని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మునీరాబాద్ ఎస్‌కేఎం పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 2 కే రన్‌ను ఆదివారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై రన్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని, క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీవీపీ తెలంగాణ అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, సౌత్ జోన్ కార్యదర్శి నరేందర్, క్రీడా భారత్ కన్వీనర్ లవకుమార్‌గౌడ్, ఎస్‌కేఎం పాఠశాల డైరెక్టర్ శృతిగౌడ్, రామేశ్వర్‌రెడ్డి, వినోద్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహులు, ఇమ్రాన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మార్‌సెట్ అధ్యాపకుడికి డాక్టరేట్



గుగులోత్ రవి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ దక్కింది. సీఎస్‌ఈ విభాగంలో అధ్యాపకుడిగా కొనసాగుతున్న గుగులోత్ రవి సీబీఐటీ ప్రొఫెసర్ స్వామిదాస్ పర్యవేక్షణలో ‘రిలయబుల్ డేటా అగ్రిగేషన్ స్కీమ్స్ ఫర్ లాట్ నెట్‌వర్క్స్’ అనే అంశంపై పరిశోధనలు చేసి ఉస్మానియా యూనివర్సిటీకి సమర్పించారు. ఈ మేరకు ఓయూ రవికి డాక్టరేట్ ప్రదానం చేసింది.